
ఈనాడు అనంతపురం

సోమవారం అక్టోబరు 7, 2024 | 9



రూ.45 లక్షలతో అలంకరించిన కన్యకా పరమేశ్వరి విగ్రహం

ధనలక్ష్మి దర్శనం.. భక్తుల పరవశం

రాయదుర్గం పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని రూ.45 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిందనూరు సుదర్శన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, రాయదుర్గం

అంతర్జాతీయ ఈత పోటీలకు ఎంపిక



జశ్విన్ నాయుడు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఈజిప్టులో జరగనున్న అంతర్జాతీయ మోడరన్ పెంటాథ్లాన్ (ఈత) పోటీలకు జిల్లాకు చెందిన ఎంఎస్ఎస్ జశ్విన్ నాయుడు ఎంపికయ్యాడు. ప్రస్తుతం కాకినాడలో చదువుతున్న ఈ బాలుడు యానాంలో సాధన చేస్తున్నాడు. గతంలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథ్లాన్ పోటీల్లో రెండు విభాగాల్లో స్వర్ణపతకాలు సాధించాడు. దాంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటాడు. ఈజిప్టులో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. బాలుడిని నగరవాసులు అభినందించారు.

రోగులకు రోడ్డుపైనే భోజనం పంపిణీ

సర్వజన వైద్యశాలలో ఇష్టానుసారంగా మెనూ అమలు



టీబీ చెస్ట్ వార్డు ఎదుట బయటే తోపుడుబండిపై రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న గుత్తేదారు సిబ్బంది

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగులేనివారికి సమయానుకూలంగా అల్పాహారం, భోజనం, మందులు అందిస్తే త్వరగా కోలుకునే పరిస్థితి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యసేవలు పొందేందుకు చేరిన రోగులకు ప్రభుత్వమే ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను చేపట్టేందుకు గుత్తేదారును ఎంపిక చేసింది. కానీ, సదరు గుత్తేదారు రోగులకు పంపిణీ చేస్తున్న మెనూలో నాణ్యత అంత అంతమాత్రంగానే ఉంది. అలాగే రోగులకు వేళకు మెనూ అందజేయాల్సి ఉండగా ఇష్టం వచ్చినట్లు అమలు చేస్తున్నారు. టీబీ, చెస్ట్‌వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించి వార్డు ఆవరణలోకి వెళ్లి భోజనం వడ్డించాలి. కానీ, వార్డు ఎదురుగా రోడ్డుపైనే తోపుడుబండి నిలిపి భోజనం పంపిణీ చేస్తున్నారు. రోగులకు బయటకు రాలేరు. అందువల్ల వారి సహాయకులు ప్లేట్లు, ప్లాస్టిక్ డబ్బాలు చేతపట్టుకుని రోడ్డుపైకి వచ్చి అన్నంతోపాటు కోడిగుడ్డు, కూరలు పెట్టించుకుని వెళుతున్నారు. అన్ని పదార్థాలను ఒకేసారి కంచంలో వడ్డిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నాణ్యతలో కోత.. నిధుల మేత

వైద్యశాలలో రోజువారీ సుమారు 1,000 నుంచి 1,200 మంది వరకు ఇన్‌పేషెంట్ (ఐపీ)లుగా సేవలు పొందుతున్నారు. వీరందరికీ ఒక తోపుడు బండిపై ఐదుగురు సిబ్బందితో మెనూ అందిస్తున్నారు. గుత్తేదారు సరఫరా చేస్తున్న మెనూ కంటే ఆసుపత్రి బయట స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పెడుతున్న భోజనం చాలా నాణ్యతగా ఉంటోందని రోగులు చెబుతున్నారు. నాసిరకంగా ఉంటున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మెనూ అమలుకు సంబంధించి రోజువారీ ఆర్ఎంఓలతోపాటు డైటీషియన్లు పరిశీలించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు భోజనం, రాత్రి భోజనం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పంపిణీ చేయాలి. ఈ సమయాలకు అనుగుణంగా మెనూ పంపిణీ చేయడం లేదని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అందించాల్సిన భోజనాన్ని ఆదివారం సాయంత్రం 5.10 గంటలకే సరఫరా ప్రారంభించడం గమనార్హం. గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోకపోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● ఈ విషయాన్ని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మెనూ అమలుకు సంబంధించి పర్యవేక్షణ పెంచుతామన్నారు. మెనూ నాసిరకంగా ఉంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ అమలు ఆలస్యం కాకుండా చర్యలు చేపడతామని వివరించారు.

మరుగుదొడ్ల స్థలాలూ వదలరు..

గుత్తిలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా



చెట్నేపల్లిలో ఈ స్థలానికి పట్టాలు ఇచ్చారు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో కొందరు స్వార్థపరులు రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఎక్కడ స్థలం కనిపించినా.. వదలడం లేదు. పురపాలిక రిజర్వుడు స్థలాలతోపాటు రెవెన్యూ ఖాళీ స్థలాలనూ యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. పాఠశాలలకు కేటాయించిన క్రీడా మైదానాలనూ వదలడం లేదు. శాశ్వత భవనాలు, ఇళ్లు నిర్మించి కొందరు అమ్ముకొంటుండగా మరికొందరు ఖాళీ స్థలాలకు రేటు కట్టి విక్రయిస్తున్నారు. తాజాగా మరుగుదొడ్లకు కేటాయించిన స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది. రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు పట్టాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. స్కావెంజర్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. సామూహిక మరుగుదొడ్లను మూసివేసింది. కొన్నిచోట్ల ఆ స్థలాల్లో సామాజిక టాయిలెట్లు నిర్మించారు. అనేక వార్డుల్లో స్థలాలు ఉన్నాయి. వాటిని పలువురు కబ్జా చేస్తున్నారు. రూ.కోట్లు విలువజేసే స్థలాలు కబ్జా అవుతున్నా ఇటు పురపాలిక అధికారులు, అటు రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి..

గుత్తిలోని చెర్లోపల్లి కాలనీలో రూ.50 లక్షలు విలువైన పదిసెంట్ల మరుగుదొడ్డి స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించాడు. రెవెన్యూ అధికారులు ముందు వెనుక ఆలోచించకుండా స్థలాన్ని పరిశీలించకుండానే ఆ వ్యక్తి పేరిట ఇంటి పట్టా మంజూరు చేశారు. అక్కడ సెంటు ధర రూ.5 లక్షలు ఉంది. అదేకాలనీకి వెళ్లేదారిలో పోలీసు క్వార్టర్ల సమీపంలో ఓ బావి ఉండేది. ఆ బావికి ఓ నాయకుడు ఇంటి పట్టా పొందాడు. బావిని పూడ్చి వేశాడు. ఆ స్థలం ఇప్పటికీ ఖాళీగానే ఉంది. స్థలం విలువ రూ.50 లక్షలు. పట్టాను పొందిన నాయకుడు మరణించడంతో స్థలాన్ని తమ కుటుంబీకులు అలాగే ఉంచారు. పురపాలిక పరిధిలోని చెట్నేపల్లిలో సుమారు పదిసెంట్ల స్థలంలో గతంలో మరుగుదొడ్డి ఉండగా దాన్ని కూల్చివేశారు. ఆ స్థలానికి ఓ మహిళకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు. ఇక్కడ సెంటు ధర రూ.4 లక్షలు ఉంది. రూ.40 లక్షలు విలువైన స్థలం అన్యాలపాలైంది. పాతసీపీఐ కాలనీలో ఉన్న మరుగుదొడ్డి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. బండగేరిలో సామూహిక మరుగుదొడ్లను పురపాలిక అధికారులు నిర్మించారు. కోట, సీపీఐ, చెర్లోపల్లి, గాంధీనగర్, గుత్తిఆర్.ఎస్.లలో మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణానికి ఏడాది కిందటే పురపాలిక కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఈ విషయమై తహసీల్దారు ఓబులేశును వివరణ కోరగా మరుగుదొడ్ల స్థలాల పరిరక్షణ బాధ్యతను పురపాలిక అధికారులు తీసుకోవాల్సి ఉంది. తాము ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇవ్వలేమన్నారు.

దిష్టిచుక్క పెట్టి

పసికందును బస్టాండులో వదిలివెళ్లిన మహిళ

దిక్కులేకుండా చేశావా అమ్మా..!



నిద్రిస్తున్న నన్ను లేపి స్నానం చేయిస్తే..
నా కోసమే కదా అని మురిసిపోయా
చేతినిండా గాజులు తొడిగి.. నుదుట బొట్టుపెడితే..
మా అమ్మ ఎంత మంచిదోనని సంబరపడ్డా..
మంచి దుస్తులు తొడిగి బస్టాండుకు తీసుకొస్తే..
అమ్మమ్మ ఊరికి వెళుతున్నామని గెంతులేశా..
అంతలోనే పని ఉందంటూ అనామకురాలి చేతిలో పెట్టిపోతే..
అమ్మే కదా.. వెంటనే వస్తుందులే అని ఎదురుచూశా..
కాలం కరిగిపోతున్నా.. ఎంతసేపటికీ నువ్వురాకపోయేసరికి..
పసికందునైన నేను పలువురి చేతులు మారుతున్నా..
ఎంతమంది ఊరడించి.. చేరదీస్తున్నా..
నీ పక్కనుంటే ఆ ఆనందమే వేరు కదమ్మా..
ఎవరి దిష్టి తగలకూడదని చుక్కపెట్టి తీసుకొచ్చి..
చివరికి.. దిక్కులేనిదాన్ని చేసి వెళ్లావా అమ్మా..

(ఓ వివాహిత కదిరి బస్టాండులో వదిలి వెళ్లిన ఐదు నెలల పసికందు ఆవేదనకు అక్షర రూపమిది)

కదిరి ఆర్టీసీ బస్టాండు ఆవరణలోనికి ఆదివారం ఐదునెలల పసికందుతో ఓ మహిళ వచ్చారు. మూత్ర విసర్జనకు వెళ్లాలంటూ ఓ బీటెక్ విద్యార్థినికి పాపను అప్పగించింది. గంటలు గడుస్తున్నా సదరు మహిళ తిరిగిరాలేదు. పరిసరాల్లో గాలించినా.. ఆమె ఆచూకీ తెలియలేదు. విద్యార్థిని వెళ్లాల్సిన బస్సు రావడంతో ఆమె డయల్ 100కు ఫోన్‌చేసి పసికందు విషయాన్ని తెలియజేసింది. సమాచారం అందుకున్న కదిరి పట్టణ పోలీసులు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుని చిన్నారిని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం ఐసీడీఎస్ అధికారులకు తెలియచేసి పాపను వారికి అప్పగించారు. మరోవైపు చిన్నారిని తీసుకొచ్చిన మహిళ ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు.. అనే కోణంలో ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. చిన్నారిని వదిలివెళ్లిన మహిళపై సుమోటాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

– న్యూస్‌టుడే, కదిరి పట్టణం




ఎన్ఎస్‌గేట్ విద్యుత్తు ఉపకేంద్రంలో రైతులకు నియంత్రికలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రైతులకు విద్యుత్తు సమస్యలు రానివ్వం

రామగిరి, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా, సీనియార్టీ ప్రాతిపదికన రైతులకు వ్యవసాయ సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని విద్యుత్తుశాఖ అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆదివారం రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పార్టీల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. రైతులకు విద్యుత్తు సమస్యలు రానివ్వకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఈఈ రాములు మాట్లాడుతూ విద్యుత్తు సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో డీఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ వెంకటేశ్వర్లు, తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్, పరంధామయాదవ్, ముత్యాలరెడ్డి, రంగయ్య, ఓబిలేశు, మాదెం సూర్యనారాయణరెడ్డి, కిష్టప్ప, చెన్నకేశవగౌడ్ పాల్గొన్నారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ యజ్ఞం



యజ్ఞహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : విశ్వశాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞాన్ని ఆదివారం ప్రశాంతి నిలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల వేదఘోష భక్తుల సాయి నామస్మరణతో పులకించింది. ఏటా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో యజ్ఞహోమాన్ని నిర్వహించడం అనవాయితీ. సాయికుల్వంత్ ధ్యానమందిరంలో ఉదయం 7 గంటలకు వేదపండితులు మంగళ వాయిద్యాలు, వేదపఠనం, స్వస్తి వాచకంతో ప్రతిష్ఠించిన కలశం వద్ద గణపతి పూజ చేశారు. ఆడిటోరియంలో ఉదయం 8.15 గంటలకు వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని వేదపండితులు నిర్వహించారు. యజ్ఞ ద్రవ్యాలను అగ్నిహోత్రునికి సమర్పించారు. సాయంత్రం సాయి విద్యార్థులు వేదపఠనం పఠించారు. బెంగళూరు ముద్దనహళ్లి క్యాంపస్ సాయి విద్యార్థులు భక్తి కీర్తనలు ఆలపించారు. యజ్ఞం విశిష్టతను డాక్టర్ భాస్కరన్ భక్తులకు వివరించారు. ఏడు రోజులు పాటు సాగే యజ్ఞ హోమం, పూర్ణాహుతితో విజయదశమి రోజు 12వ తేదీన ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, దేశ, విదేశాలకు చెందిన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



వేదాలు పఠిస్తున్న సాయి విద్యార్థులు

అతివకు ఆర్థిక చేయూత

రుణాల మంజూరుతో స్వయం ఉపాధి దిశగా చర్యలు



రాయదుర్గంలో అవగాహన కల్పిస్తున్న వెలుగు సమన్వయకర్త గంగాధర్

రాయదుర్గం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, తద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణాలు మంజూరు చేయనుంది. అందుకు లక్ష్యాలను ఇప్పటికే నిర్దేశించారు. జిల్లాలో మొత్తం స్వయం సహాయక సంఘాలు 35,895 ఉండగా వీటిలో 3,79486 మంది సభ్యులు ఉన్నారు. వీరికి బ్యాంకు లింకేజీ, పొదుపు ఖాతాల నుంచి రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి, పీఎం.ఈజీపీ తదితరాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.374 కోట్ల మేర రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యులు ప్రస్తుతం ఎలాంటి ఉపాధి పొందుతున్నారు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ ఇవ్వాలనే విషయంపై ఇటీవల సర్వే చేశారు. ఆ మేరకు రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.139 కోట్ల రుణాలు అందించినట్లు డీఆర్‌డీఏ, వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

రుణాలు	మొత్తం సంఘాలు	లక్ష్యం (రూ.కోట్లలో)	రుణం పొందిన సంఘాలు	మొత్తం (రూ.కోట్లలో)
బ్యాంకు లింకేజీ	25,798	123.83	6033	39.4
వ్యక్తిగత	7130	71.30	883	12.38
ఎస్సీ ఉపప్రణాళిక	2,415	12.45	1,985	10.14
ఎస్టీ ఉపప్రణాళిక	600	3.00	323	1.59
శ్రీనిధి	32,400 మంది	162.00	9,495 మంది	74.65
సీడ్ క్యాపిటల్	310 మంది	1.24	342 మంది	1.37

నాన్ జ్యుడీషియల్ స్టాంపులకే మొగ్గు

రూ.16 కోట్ల పత్రాల కొనుగోలుకు ప్రతిపాదనలు



జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మళ్లీ నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ-స్టాంపింగ్ కాగితాల నాణ్యతపై అనేక ప్రశ్నలు ఉత్పన్నం కావడంతో పాత విధానంలోనే వెళ్లేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అవసరమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు తెప్పించడానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. నాసిక్ నుంచి వాటిని నేరుగా సరఫరా చేస్తే పాత పద్ధతిలోనే కౌంటర్లలో స్టాంపుల అమ్మకం ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఈ-స్టాంపులు, నాసిక్‌లో తయారయ్యే నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కొన్ని కేంద్రాల్లో మాత్రమే ఈ-స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 21 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో గతంలో అన్నిరకాల స్టాంపుల విక్రయం జరిగేది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాసిక్‌లో తయారయ్యే స్టాంపుల విక్రయం పూర్తిగా ఆపేసింది. నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేయలేక వాటి అమ్మకాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసిన ఘనత వైకాపాకే దక్కుతుంది. నకిలీ స్టాంపులు నిరోధించడానికే ఈ-స్టాంపుల విధానం అమల్లోకి తెచ్చినట్లు గతంలో గొప్పలు చెప్పుకున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ-స్టాంపుల కన్నా నాసిక్‌లో తయారయ్యే స్టాంపులపైనే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తున్న ఈ-స్టాంపు కాగితాల నాణ్యత కూడా డొల్లగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిపై అభిప్రాయాలు సేకరించింది. పాత విధానంలోనే స్టాంపుల అమ్మకం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే జరగాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో రెండు జిల్లాలకు సుమారు రూ.16 కోట్ల విలువైన స్టాంపులు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే అవి అన్ని కార్యాలయాలకు సరఫరా అయ్యే అవకాశాలున్నాయి.

ఈ-స్టాంపింగ్ పత్రాలకు అదనపు వసూళ్లు

ఉమ్మడి జిల్లాలో ఈ-స్టాంపింగ్ కాగితాలు అమ్మే సీఎస్‌సీ కేంద్రాలు, బ్యాంకులు, వెండర్లు సుమారుగా 130 మంది ఉన్నారు. ప్రస్తుతం అందరికీ స్టాంపు కాగితాలు సరఫరా చేయలేదు. వెండర్లకు అసలు సరఫరా చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా రెండు జిల్లాలకు కర్నూలు నుంచి ఈ కాగితాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఒకటి రెండుచోట్ల మినహాయిస్తే అన్ని చోట్లా కాగితాల కొరత పీడిస్తోంది. కాగితాలు అందుబాటులో ఉన్న కేంద్రాల్లో ఒక్కో స్టాంపుపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. దస్తావేజు కూడా తమ దగ్గరే రాయించుకోవాలని నగరంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో షరతు పెడుతున్నారు. దీనిపై దస్తావేజు లేఖర్లు కూడా మండిపడుతున్నారు. కామన్ సర్వీస్ సెంటర్లపై అజమాయిషీ చేసే అధికారం రిజిస్ట్రేషన్లశాఖ అధికారులకు లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు.

ప్రజల అభీష్టం మేరకు చర్యలు

నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తపాలా కార్యాలయాల్లో మిగిలిపోయిన స్టాంపులను వెనక్కి తెప్పించి విక్రయాలు చేయాలని నిర్ణయించాం. ప్రజల అభీష్టం మేరకే స్టాంపులను మళ్లీ కౌంటర్లలో విక్రయిస్తాం.

- భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

మెదడుకు పదును.. ప్రతిభకు పట్టం

- చదరంగంలో మెరుస్తున్న చిన్నారులు

హిందూపురం, న్యూస్‌టుడే: పదిహేను సంవత్సరాలు నిండలేదు.. మెదడుకు పదును పెట్టారు.. బెంగళూరులో సెప్టెంబరు 22న నిర్వహించిన అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి భళా అనిపించుకొన్నారు హిందూపురానికి చెందిన ఈ చిన్నారులు. భవిష్యత్తులో చదరంగంలో గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలని.. చెస్‌లో ప్రపంచ చెస్ విజేతగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. దీనికి వీరు చేస్తున్న కృషి ఇప్పటి వరకు సాధించిన పతకాల వివరాలు వారి మాటల్లోనే..



ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని ఉంది

పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి చెస్ అంటే ఎంతో ఇష్టం. అందుకే ఇంట్లో అవకాశం ఉన్నప్పుడు చెస్‌ఆడుతూ మెలకువలు నేర్చుకొంటుంటాను. ఇప్పటి వరకు అండర్ 11 అనంతపురం రెండు దఫాలు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించాను. అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపి 1532 రేటింగ్ సాధించటం నా జీవితంలో మరచిపోని సంఘటన. భవిష్యత్‌లో మరింత శ్రమించి పపంచ చాంపియన్ నంబర్‌వన్‌గా నిలవాలని ఉంది.

\- జి.జ్ఞాపికారెడ్డి, మార్కండేయనగర్, హిందూపురం

ప్రపంచ చెస్ విజేతగా నిలుస్తా..

\-సీఎన్‌పీ మిథున్‌పెద్దన్న, బాపూజీనగర్, హిందూపురం



పట్టణంలోని దీప్తి పాఠశాలలో 7వ తరగతి చదువుతూ స్థానికంగా స్పార్టన్ చెస్ అకాడమిలో రెండేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నాను. ధర్మవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో, కర్నూలు, విజయవాడలో ఈ సంవత్సరం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి 20 పతకాలు సాధించాను. చెస్‌లో రాణించిన ప్రజ్ఞానంద స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచ చెస్ విజేతగా నిలవాలని కృషి చేస్తున్నాను. అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో 1455 రేటింగ్ సాధించటం ఎంతో గర్వంగా ఉంది.

గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలని ఉంది

\-విష్ణుకిరణ్, మోతుకపల్లి



నాకు చెస్‌లో రాణించి గ్రాండ్‌మాస్టర్ కావాలని ఉంది. అందుకే ప్రతి రోజూ దాదాపు గంటకుపైగా దీనిపై కోచ్ వద్ద శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకొంటున్నాను. ప్రస్తుతం 9 తరగతి చదువుతున్న నేను చదువు లోనూ రాణిస్తున్నాను. పెనుగొండ, అనంతపురం పట్టణాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు పొందాను, అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి 1463 రేంటింగ్ సాధించటం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

జీబీసీకి గండి.. సాగునీరు వృథా

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)కి 28.5 కి.మీ. వద్ద గండి పడింది. డొనేకల్లు వంకపై ఉన్న జీబీసీ అండర్ టన్నెల్ శిథిలావస్థకు చేరుకుని స్లాబ్ కూలింది. ఈ ఘటన రెండు రోజుల కిందటే జరిగింది. చివరి ఆయకట్టుకు నీరు రావడం లేదని పలువురు రైతులు పరిశీలించుకుంటూ కాలువపై రావడంతో వెలుగు చూసింది. గండి పడటంతో సాగునీరు మొత్తం వంక పాలవుతోంది. దీని కారణంగా ఆయకట్టు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. గత నెలలో నాలుగో కి.మీ. వద్ద కూడా అండర్ టన్నెల్ రక్షణ గోడ కూలిపోయి దాదాపు 20 రోజులు నీటి ప్రవాహం ఆగిపోయింది. ఇప్పటికే విడపనకల్లు మండలం గడేకల్లు, పాలికి, పెంచలపాడు గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు నీరు సరిగా సరఫరా కాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులను వేగంగా చేయించాలని రైతులు కోరుతున్నారు. దీనిని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లగా, మరమ్మతులు పనులు త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారని తెదేపా నాయకుడు గడేకల్లు శీన తెలిపారు. గండి పడిన ప్రదేశాన్ని గుర్తించామని, ఉన్నతాధికారులకు తెలిపి మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు జీబీసీ డీఈఈ రఘుచరణ్ పేర్కొన్నారు.



వంకలోకి ప్రవహిస్తున్న నీరు

సంతల ఆదాయం రూ.4.83 లక్షలు

అనంత మార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని శని, ఆదివారం సంతల్లో రూ. 4,83,840 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ. 2,70,540 రాగా, పశువుల సంతలో రూ. 2,13,300 ఆదాయం వచ్చిందని, యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

టమాటా కిలో రూ.52

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గాయి. ఆదివారం మొత్తం 18 మండీలకు 675 టన్నులు వచ్చాయి. కిలో గరిష్ఠంగా రూ. 52, మధ్యస్థం రూ. 40, కనిష్ఠం రూ. 30 చొప్పున ధరలు పలికాయి. 15 కిలోల బుట్ట ధర గరిష్ఠం రూ. 780, మధ్యస్థం రూ. 600, కనిష్ఠం రూ. 450 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

ఘనంగా మాదిగల ఆత్మీయ కలయిక

- రక్త దాతలకు ధ్రువపత్రాల అందజేత

పెనుకొండ,న్యూస్‌టుడే: స్థానిక త్రిపురా రిసార్ట్స్‌లో ఆదివారం మాదిగల ఆత్మీయ కలయిక 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ సునీల్‌కుమార్ చావలి హాజరయ్యారు. మాదిగల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహకరించుకోవాలని వక్తలు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 8మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆర్టీఐ కమిషనర్ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం త్రిపురారిసార్ట్స్ యజమాని, భాజపా సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీకే ఫౌండేషన్‌కు రూ. 25వేలు చెక్ అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అజిత్‌కటికల, కార్యదర్శి త్రివిక్రమ్, నాయకులు ఉలవల నాగరాజు పోతులయ్య, ఆశావాది సుధామకీర్తి, 23 జిల్లాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భాజపా సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్‌ను సత్కరిస్తున్న నాయకులు

'రైతుకు నష్టం కలిగిస్తే సహించం'

బత్తలపల్లి: రైతుకు నష్టం కలిగించే పని ఏ పార్టీ వారు చేసినా సహించేది లేదని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన స్పష్టం చేశారు. బత్తలపల్లి మండలం తంబాపురంలో జనసేన పార్టీ నాయకులు రమణారెడ్డి పొలంలో 53 చీనీ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నరికివేశారు. విషయం తెలుసుకున్న చిలకం మధుసూదనరెడ్డి మండల నాయకులతో కలసి ఆదివారం తంబాపురం వెళ్లి నరికిన చీనీచెట్లను పరిశీలించారు. రెండు సంవత్సరాలకుపైగా రైతు కష్టపడి పెంచుకున్న చెట్లను నరికివేయడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పని ఏ పార్టీ నాయకులు చేసినా సహించేది లేదని రాబోవు రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ రవి, భాజపా మండల కన్వీనర్ వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి పొలంలో నరికివేసిన చీనీచెట్లు పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రచయిత, సాహితీ వేత్తలు

వ్యవస్థ లోపాలను ప్రశ్నించే కథలు రావాలి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే విధంగా కథలు రావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోంలో ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రెడ్డెప్పరెడ్డి రచించిన చెరువు గండి జననాయక జయహే ది గ్రేట్ డిక్లైన్ కథల పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కథల పుస్తకాన్ని సమీక్ష చేసిన ప్రముఖ విమర్శకులు వేణుగోపాల్ ప్రసంగిస్తూ పేదలను మార్కెట్ మాయాజాలం ఎలా పిప్పి చేస్తుందో, పేదలు ఎలా దోపిడీకి గురవుతారో కథలో చక్కగా వివరించారన్నారు. ప్రపంచ సంక్షోభం వెనుక దాగి ఉన్న సమస్యల గురించి రాయడం రచయిత ముందు చూపునకు నిదర్శనం అన్నారు. ఎవరు ఆలోచించని అంశాన్ని ఎంపిక చేసుకొని నవల రాయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, రచయిత శాంతినారాయణ, అరసం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర పాల్గొన్నారు.

పరిహారం ఇప్పిస్తామంటూ మోసం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మరణ పరిహారం ఇప్పిస్తానంటూ బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి అన్‌లైన్‌లో నగదు వేయించుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మేడాపురం గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర అప్పుల బాధ తాళలేక గత నెల 30న ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన సూరి, మృతుని సోదరుడు ముత్యాలుకు ఫోన్ చేసి తనకు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ తెలుసని, ఆయన రైతు మరణం అని ధ్రువీకరిస్తే రూ. 6 లక్షలు పరిహారం మంజూరవుతుందని నమ్మబలికాడు. కాన్ఫరెన్స్ కాల్ కలిపి వేరే వ్యక్తితో మాట్లాడించాడు. వారి మాటలు నమ్మిన ముత్యాలు ఫోన్ పే ద్వారా రూ. 18,160 బదిలీ చేశారు. కాసేపటికి సదరు ఫోన్ నంబర్ పని చేయకపోవడంతో అనుమానం వచ్చి సూరికి ఫోన్ చేశారు. నగదు ఎవరు వేయమన్నారని, దానికి నేను బాధ్యత వహించలేనని అతడు చేతులెత్తేశాడు. చేసేదిలేక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కమిటీల మధ్య విభేదాలు వద్దు: మంత్రి

పెనుకొండ: వెంకటగిరిపాళ్యం పరిధిలోని కోన కన్యాశ్రమంలో కమిటీల మధ్య విభేదాలు ఉండకూదని, భక్తుల సమక్షంలో అభివృద్ధి పనులు నిర్వహించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. ఆదివారం కోనలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మంత్రి సవిత, పార్టీశ్రేణులతో కలసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని రెండు కమిటీల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఆలయ అభివృద్ధి, నిర్వహణ కుంటుపడుతోందని భక్తులు సమావేశం నిర్వహించడంతో గతంలో జరిగిన అంశాలపై చర్చించారు. 50 ఏళ్లుగా పీఠాధిపతిగా ఉన్న విష్ణుదాసస్వామి మూడేళ్ల క్రితం మృతిచెందారు. ఆయన మరణాంతరం భక్తుల సమక్షంలో పీఠాధిపతిగా చంద్రస్వామిని నియమించారు. భక్తుల్లో విభేదాలు రావడంతో గత ప్రభుత్వ పాలనలో అక్కడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో, రెండు కమిటీల మధ్య తరచు గొడవలు పడడంతో అభివృద్ధికుంటుపడింది. ఆదివారం మంత్రి సవిత ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీధర్, సీఐ రాఘవన్, భక్తాదులతో కలసి చర్చించారు. ఆశ్రమపీఠాధిపతిగా చంద్రస్వామిని కొనసాగించేలా, బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును కోనకన్యాశ్రమం పేరుతో బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి, ఆలయభూములు సైతం ఆశ్రమం పేరు మీదే ఉంచేలా, 6నెలలకోసారి భక్తులు, గ్రామస్థులు సమక్షంలో ఆడిట్‌చేసే విధంగా తీర్మానించారు.



కమిటీల రద్దు పై చర్చిస్తున్న మంత్రి సవిత, అధికారులు

'నడిమిదొడ్డి చౌక దుకాణంలో అక్రమాలు'

నార్పల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో రేషన్ దుకాణంలో గత 5 నెలలుగా లెక్కకు మంచి అక్రమాలు జరిగాయని, ఇది తమ పరిశీలనలో తేలిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓ.నల్లప్ప ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్‌ను కచ్చితంగా మారుస్తారని గ్రహించిన పాత డీలరు 5 నెలలుగా 560 కిలోల జొన్నలు కార్డు దారులకు ఇచ్చామంటూ 560 కిలోల బియ్యం కోటా తగ్గించి ఇచ్చారన్నారు. బియ్యంతో పాటు, జొన్నలు కూడా లబ్ధిదారులకు సక్రమంగా ఇవ్వకుండా పక్కదారి పట్టించారన్నారు. గ్రామంలో మొత్తం 626 మంది కార్డులు ఉండగా 26 శాతం మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యమే వేయలేదన్నారు. మిగిలిన బఫర్ బియ్యం స్టాకును పక్కదారి పట్టించారన్నారు. పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అప్పటికైనా చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మహిళా రైతు మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దల గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. న్యామద్దలకు చెందిన వెంకటరెడ్డి, తన భార్య శైలజతో కలిసి పొలం పనులు ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు వారిని అడ్డగించారు. వెంకటరెడ్డిపై దాడి చేసి భార్య మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. గొలుసు విలువ రూ. 2.20 లక్షలు అని బాధితులు వాపోయారు. సీకేపల్లికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

త్వరలో శ్రీశైలానికి బస్సు సర్వీసు

కదిరి, న్యూస్‌టుడే : కదిరి డిపో నుంచి త్వరలో శ్రీశైలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజా రవాణా జిల్లా అధికారి మధుసూదన్ తెలిపారు. ఆదివారం కదిరి ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలానికి బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బస్టాండు ఆవరణంలోని ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎం హరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, ఎన్‌ఎంయూఏ నాయకులు ఎన్వీ రమణ, హరిమోహన్, బైరిశెట్టి, రామచంద్ర, సురేంద్ర, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండులో సదుపాయాలు పరిశీలిస్తున్న జిల్లా అధికారి మధుసూదన్

భగీరథ కల్యాణ మండప స్థలంపై వివాదం

- పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి అక్కమ్మకొండ పక్కన ఉప్పర/సగర సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న భగీరథ కల్యాణ మండపం స్థలంపై వివాదం నెలకొంది. ఇక్కడున్న మొత్తం 59 సెంట్ల స్థలంలో రూ. కోటి ఎంపీ నిధులతో భగీరథ కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమానికి సోమవారం ఉదయం ఎంపీ బీకే పార్థసారథి రానున్న నేపథ్యంలో మంత్రి ఎస్. సవిత వర్గీయులు ఆదివారం సాయంత్రం స్థలం వద్దకు చేరుకొని పనులను అడ్డుకొన్నారు. దీంతో వివాదం తలెత్తడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో చివరకు సోమవారం నిర్వహించనున్న కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘం నాయకులకు తెలియజేశారు. ఈ సమాచారంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, తమ సిబ్బంది, ప్రత్యేక పోలీసులు చేరుకొని ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్థానిక ఉప తహసీల్దార్లు రెడ్డిశేఖర్, గంగాశంకర్, సర్వేయర్ వినోద్‌కుమార్, రెవెన్యూ అధికారులు నాగరాజు తదితరులతో కలసి చేరుకొని స్థలాన్ని పరిశీలించి, ఉప్పర/సగర సంఘం నాయకులు గోపాల్, రామచంద్ర తదితరుల వద్దనున్న స్థలం హక్కు పత్రాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ రికార్డులను పరిశీలించాక, సర్వేయర్, రెవెన్యూ అధికారులతో మొత్తం స్థలాన్ని సర్వే చేయించారు. సంఘం నాయకుల వద్దనున్న భూ పత్రాలకు, అక్కడున్న స్థలం కొలతల్లో తేడా ఉండటంతో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని, త్వరలోనే ఈ స్థలం సమస్యను చట్టప్రకారం త్వరలోనే పరిష్కరించ నున్నట్లు ఆర్డీవో విలేకరులకు వివరించారు.



సోమందేపల్లి: వివాదంగా మారిన స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనందకుమార్ , పక్కన డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

పోగొట్టుకున్న నగల అందజేత

తాడిపత్రి, న్యూస్‌టుడే : ఓ ఆటోలో బంగారు నగల సంచిని పోగొట్టుకున్న దంపతులకు వాటిని గుర్తించి పట్టణ పోలీసులు ఆదివారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి అనంతపురం వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కి వచ్చారని, దిగే హడావుడిలో తమ వద్ద ఉన్న బంగారు నగల సంచిని అందులోనే మరిచిపోయారు. ఆటోముందుకు వెళ్లిపోయింది. తరువాత సంచి పోయిందని తెలుసుకున్న బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి ఆటోను గుర్తించి అందులో ఉన్న సంచిని అందజేశారు. సుమారుగా ఐదు తులాల వరకు ఉన్న బంగారు నగలను పోలీసులు దంపతులు గురుప్రసాద్, వాణీలకు అందజేసినట్లు తెలిపారు.



నగల సంచిని అందజేస్తున్న పట్టణ పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- కుంగిన రోడ్డులో అదుపు తప్పిన వాహనం

లేపాక్షి, హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలంలోని చోళసముద్రం జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. లేపాక్షిలోని బ్రహ్మకుమారీ ఆశ్రమంలో ఉంటున్న 8 మంది సభ్యులు ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కారులో మడకశిర వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకొని తిరుగు ప్రయాణంలో చోళసముద్రం జాతీయ రహదారి కూడలికి కూతవేటు దూరంలో రోడ్డు కుంగడంతో వేగాన్ని అదుపు చేయలేక కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బిసలమానేపల్లికి చెందిన ఎ.సరస్వతమ్మ(57), చిలమత్తూరు మండలం చినగానిపల్లికి చెందిన నారాయణమ్మ(65), లేపాక్షికి చెందిన అంజినప్ప, శశాంక్, సరస్వతమ్మ, బిసలమానేపల్లికి చెందిన నారాయణమ్మ, లక్ష్మమ్మ, కర్ణాటక రాష్ట్రం నగరిగెరకు చెందిన రాజేశ్వరిలకు తీవ్ర గాయాల్యయాయి. వెంటనే స్థానికులు వీరందరినీ జాతీయ రహదారి అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బిసలమానేపల్లికి చెందిన ఎ. సరస్వతమ్మ, చిలమత్తూరు మండలం చినగానిపల్లికి చెందిన నారాయణమ్మలు మృతి చెందారు. మిగిలిన ఆరుగురిలో లక్ష్మమ్మకు స్థానికంగా చికిత్సలు అందిస్తున్న వైద్యులు అంజినప్ప, శశాంక్, సరస్వతమ్మ, నారాయణమ్మ, రాజేశ్వరీలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. ఆసుపత్రి ప్రాంగణలో మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ జయప్ప బాధితులను పరామర్శించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి వెంటనే వైద్యం అందేలా ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న చర్యలు తీసుకొన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



సరస్వతమ్మ

హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే..

హైవే అథారిటీ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. చోళసముద్రం వద్ద జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన పక్కనే పాడుబడిన బావి ఉంది. దీంతో రహదారి తరచూ కుంగి పోతోంది. విషయాన్ని అధికారులకు స్థానికులు తెలపినా నాసిరకంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నట్లు విమర్శలున్నాయి. సాయంత్రం డీఎస్పీ మహేశ్, హిందూపురం గ్రామీణ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ రహంతుల్లా (55) ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారని గ్రామీణ ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రహంతుల్లా పొట్టి శ్రీరాములురోడ్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవులో ఉన్నారన్నారు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. పాతకొత్తచెరువు గ్రామం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



రహంతుల్లా

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

శింగనమల : శింగనమల కలిగొంది కొండల మధ్య ఆదివారం రాత్రి పిడుగు పడి శంకర్(27) అనే గొర్రెల కాపరి మృతి చెందారు. స్థానిక బోయ వీధికి చెందిన కాపరి వర్షం పడుతున్న సమయంలో చెట్టు కిందకు వెళ్లారు. ఉరుములు, మొరుపులో కూడిన వర్షం పడింది. చెట్టుపై పిడుగు పడటంతో అక్కడే ఉన్న కాపరి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామానికి చెందిన బొజ్జప్పకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. రెండో కుమారుడు శంకర్ కొన్నేళ్లుగా గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల బోరున విలపించారు. సీఐ కౌలుట్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



శంకర్

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ


ఉద్దేహాళ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2005 - 2006 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. మిత్రులతో కలిసి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులతో ఆశీర్వాదాలు పొందారు. ప్రధానోపాధ్యాయుడు రాజసూరీడు, ఈశ్వరగౌడ్, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, శ్రీనివాస్ యాదవ్, సుచరిత, ఉషారాణిలను సత్కరించారు.

పండగ పూట.. వేతనాలు ఇవ్వరా?

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 7 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద ఆ పథకం ప్రధాన పంపింగ్ కేంద్రం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు ప్రకటించారు. జడ్పీకి వచ్చిన ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇవ్వకుండా ఎక్కడికి మళ్లించారని ప్రశ్నించారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రతినిధి నాగమణి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

చౌక దుకాణం ప్రారంభం

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని అపిలేపల్లిలో నూతన ప్రభుత్వ చౌక దుకాణాన్ని తెదేపా నాయకుడు ధర్మతేజ, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్డుదారులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ఓబులేశ్, చలపతి, రామాంజనేయులు, రామిరెడ్డి, విరుపాక్షి, జయచంద్ర, రాఘవేంద్రబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ హసీనాబాను ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో 3, గ్రామీణంలో 2, బ్రహ్మసముద్రం 1, బెళుగుప్ప 1 మద్యం దుకాణాలు నిర్వహించవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్, లేదా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు 3 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు ఆదివారం సీఐ వెంకటరమణ కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రశాంతంగా ఉన్న చోట్ల ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్టీఆర్ గృహాలకు మహర్దశ

☛ త్వరలో లబ్ధిదారులకు బిల్లులు ☛ సర్వత్రా హర్షాతిరేకాలు


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలలను నెరవేర్చేందుకు 2016-19లో గత తెదేపా ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసింది. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎన్టీఆర్ పక్కా ఇళ్ల బిల్లులు ఆగిపోయాయి. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన వారు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లు కూడా ఇప్పటికీ పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎన్టీఆర్, జగనన్న పక్కా ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు చేపట్టి లబ్ధిదారులు పక్కా ఇళ్లు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

మండలం	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్సీ	పూర్తయినవి	మొత్తం
బ్రహ్మసముద్రం	44	227	71	403	196	941
కళ్యాణదుర్గం	47	227	99	473	302	1,148
కంబదూరు	53	126	52	321	121	673
కుందుర్పి	20	238	128	245	355	986
శెట్టూరు	31	262	87	383	270	1,033
మొత్తం	195	1,080	437	1,825	1,244	4,781

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా..

కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా బీబీఎల్ (పునాదుల కోసం తవ్విన గుంతలు), బీఎల్ (పునాదులు), ఆర్ఎల్ (గోడలస్థాయి), ఆర్సీ (పైకప్పు)లలో వివిధ దశల్లో 4,781 పక్కా ఇళ్లు ఉన్నాయి. వీటిలో బీబీఎల్ స్థాయిలో 195, బీఎల్ స్థాయిలో 1,080, ఆర్ఎల్‌లో 437, పూర్తయిన ఇళ్లు 1,144 ఉన్నాయి. గతంలో ఎన్టీఆర్ ఇంటి నిర్మాణానికి రూ. 1.50 లక్షలు కేటాయించారు. దానిని పెంచి ప్రస్తుతం రూ.1.80 లక్షలు ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.


మరో అవకాశం వచ్చింది



- నీలమ్మ, లబ్ధిదారురాలు, గొల్ల

తెదేపా హయాంలో ఎన్టీఆర్ ఇల్లు మంజూరైంది. వైకాపా ప్రభుత్వం అడ్డంకులతో ఇప్పటికీ నిర్మించుకోలేక పోయాను. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మా బాధలు తెలుసుకొని మరోసారి ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది.

అప్పులు చేసి నిర్మించుకున్నాం



- సువర్ణ, లబ్ధిదారులు, చాపిరి

2016లో ఎన్టీఆర్ ఇల్లు మంజూరు చేసింది. మొదట్లో సంతోషంగా ఉండేది. వైకాపా వచ్చిన తరువాత పట్టించుకోలేక పోయింది. అప్పులు చేసి కొంత వరకు ఇంటి నిర్మాణం చేపట్టాం. అందులోనే నివాసం ఉంటున్నారు. ఇప్పుడు తెదేపా అధికారంలోకి వచ్చి బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పడం ఆనందంగా ఉంది. బిల్లు వస్తే నిర్మాణం పూర్తి చేసుకుంటాం.

క్షేత్రస్థాయిలో నిర్మాణాల పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గృహాలపై ఇప్పటికే సర్వే పూర్తి చేశాం. లబ్ధిదారులకు నిర్మాణాలు, బిల్లుల మంజూరుపై అవగాహన కల్పిస్తున్నాం. నిర్మాణాలు త్వరగా చేపడితే బిల్లులు మంజూరవుతాయి. క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి, యాప్‌లో నమోదు చేస్తున్నాం.

- విజయభాస్కర్‌రావు, డీఈ, గృహనిర్మాణశాఖ, కళ్యాణదుర్గం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: గాంధీ పాఠశాల సమీపంలో విద్యుత్తు తీగలకు ముళ్లపొదలు తగిలి మంటలు చెలరేగుతున్నాయి. **- రవి**

సమాధానం: ముళ్లపొదలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- జగన్నాథ్**

సమస్య: కొలిమి వీధిలోని నారాయణ పాఠశాల సమీపంలో మురుగు కదలక దుర్వాసన వస్తోంది. **- తిప్పేస్వామి**

సమాధానం: తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: పది రోజులకు పైగా నియంత్రిక మరమ్మతుకు గురై సరఫరా ఆగిపోయింది. **- పార్వతి**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం.- బాలరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్

సమస్య: రైతు సహాయ కేంద్రాలకు చాలాచోట్ల రైతు భరోసా కేంద్రాలని బోర్డులు ఉన్నాయి. **- మల్లికార్జున**

సమాధానం: త్వరలోనే రైతు సహాయకేంద్రాల బోర్డులు ఏర్పాటు చేస్తాం. **- మధుకర్, మండల వ్యవసాయాధికారి**

సమస్య: తట్రకల్లు- ఎన్ఎన్‌పీ తండా రహదారిలో వంక నీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. **- సుధాకర్**

సమాధానం: వంక నీటిని మళ్లించడానికి కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. **- మణిభూషన్, పంచాయతీరాజ్ మండల ఇంజినీర్**

సమస్య: ఉరవకొండ దుర్గా భవానీ ఆలయానికి వెళ్లే దారిలో మురుగు నిలుస్తూ ఇబ్బందిగా ఉంది. **-వీరేశ్**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- గౌస్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం, వజ్రకరూరు, ఉరవకొండ

బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సంఘ సభ్యులు

కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన శ్రీనివాసులు కుటుంబానికి లాఫింగ్ ఫ్రెండ్స్ సంఘం సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈనెల 3న 'ఈనాడు' పత్రికలో 'పుట్టెడు శోకం.. బతుకు భారం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన లాఫింగ్ ఫ్రెండ్స్ సంఘం సభ్యులు ఆ కుటుంబానికి రూ.13,500 నగదు, 26 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. సభ్యులు బాలరాము, గోపి, ఖలీల్, వెంకటేశ్, కె.వెంకటేశులు పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో సింగల్ పేజ్ విద్యుత్తు నియంత్రికను ఆదివారం ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 30న 'ఈనాడు'లో 'అంధకారంలో కొత్తపల్లి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. మాజీ సర్పంచి కేశప్ప స్పందించి నియంత్రికకు అవసరమైన విద్యుత్తు పరికరాలను సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అమర్చారు. గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఈనాడు కథనాలకు స్పందన

మోటార్లు బిగించారు.. నీటిని వదిలారు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయి నీటి పథకానికి సంబంధించి పీఏబీఆర్‌లో పాడైన మోటార్లకు మరమ్మతులు చేసి బిగించడంతో ఆదివారం నీరు వదిలారు. ఈనెల 5న 'తాగునీటి పథకాలు పడకేశాయ్' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం వెలుడింది. స్పందించిన జిల్లా అధికారులు మోటార్లను మరమ్మతు చేయించి పీఏబీఆర్ డ్యాంలో బిగించి నీటిని పంపింగ్ చేశారు. కళ్యాణదుర్గం పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు నీటి సరఫరా జరిగింది.


ఉరవకొండ: సంతాన లక్ష్మి అలంకారంలో ఉద్భవలక్ష్మి


ఉరవకొండ: లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గాభవాని


రాయదుర్గం పట్టణం: దుర్గామాతగా మహాలక్ష్మీదేవి


రాయదుర్గం: శాంతినగర్ బన్నిమహాంకాళి..


రాయదుర్గం: దుగ్గిలమ్మ అమ్మవారు

విశ్రాంత విద్యాశాఖాధికారి మృతికి సంతాపం

రాయదుర్గం: రాయదుర్గం విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కె.మల్లికార్జునప్ప (70) ఆదివారం అనారోగ్యం మృతిచెందారు. మధ్యాహ్నం వరకు పెన్షనర్ల భవనంలో తోటి మిత్రులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఇంటికి వెళ్లిన ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఆయన మృతికి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, పెన్షనర్లు సంతాపం తెలియజేశారు.

రెండు దుకాణాల్లో చోరీ

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని ఆవులదట్ల జాతీయ రహదారి పక్కన ఉన్న కిరాణా దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చిదానంద, ఆంజనేయులుకు చెందిన దుకాణాలకు ఉన్న తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. రూ.3 వేల నగదు, రూ.20 వేలు విలువ సరుకులు ఎత్తుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

కమనీయం.. అమ్మ రూపం


కళ్యాణదుర్గం గ్రామీణం: కోటవీధిలో బొమ్మలకొలువు

అమ్మవారి ఆలయాల్లో దసరా నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే, బృందం**


కణేకల్లు: గాయత్రీ దేవి అలంకరణలో..


బొమ్మనహాళ్‌లో..


కళ్యాణదుర్గం: లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో వాసవీమాత


కళ్యాణదుర్గం గ్రామీణం: మీనాక్షిదేవి అలంకరణలో

మడుగు కాదు.. రహదారే



వర్షం కురిస్తే పట్టణంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో నీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తోంది. వాహనాలు వెళ్లినప్పుడు పక్కనే ఉన్న ఇళ్లలోకి నీరు పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న నీటిని పక్కకు మళ్లించేలా సంబంధిత అధికారులు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. రోడ్లు భవనాల శాఖ ఏఈ జాహ్నవిని వివరణ కోరగా.. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

అడవిని తలపిస్తున్న జగనన్న కాలనీ

ఈ చిత్రంలో దట్టంగా పెరిగిన ముళ్లపొదలు చిట్టడవిని తలపిస్తుంది. ఇది మండలంలోని నింబగల్లులోని జగనన్న కాలనీ. గత వైకాపా ప్రభుత్వం ఇక్కడ 70 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఆ మొత్తం అక్కడి నేలలో బేస్‌మెంట్ నిర్మాణానికి కూడా చాలవని భావించిన లబ్ధిదారులు అక్కడ ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇప్పటి వరకు అక్కడ ఒక్క ఇల్లు మాత్రమే నిర్మించారు. అధికార యంత్రాంగం కనీసం అక్కడ పెరిగిన ముళ్లపొదలను తొలగించి, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వంలోనైనా ఇళ్లను నిర్మించుకునేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. దీనిని గృహ నిర్మాణ డీఈఈ హనుమప్ప దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి ముళ్లపొదల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.



- న్యూస్‌టుడే, ఉరవకొండ

బురదదారిలో సాగని నడక



దర్గాహొన్నూరు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి నుంచి విడపనకల్లు మండలం గాజుల మల్లాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును మరమ్మతులు చేయిస్తామని చెప్పినా ఐదేళ్లలో గంప మట్టి కూడా వేయలేదని గ్రామస్థులు వాపోయారు. వర్షానికి మట్టి రోడ్డు బురదమయంగా తయారై కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడానికి కష్టంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈఈ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్


హిందూ శ్మశానవాటిక సభ్యులకు సూచనలిస్తున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి

వ్యాపార దుకాణాల నిర్మాణానికి ప్రతిపాదనలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని బళ్లారి రోడ్డుపక్కన ఉన్న హిందూ శ్మశానవాటిక ముందు వ్యాపార దుకాణాల నిర్మాణాలకు ఆదివారం శ్మశానవాటిక కమిటీ అధ్యక్షుడు సి.నాగప్ప, గౌరవాధ్యక్షుడు హనుమంతు, తెదేపా నాయకుడు జిలాన్‌బాషాలతో పాటు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం కమిటీతో దాదాపు రూ.20 లక్షల దాకా నిధులు ఉన్నాయని, వ్యాపారులతో గుడ్‌విల్ పద్ధతి ద్వారా కొన్ని నిధులు, అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సహకారంతో మిగిలిన నిధులు సేకరించేందుకు నిర్ణయించారు.

● పట్టణ ప్రజలకు శుద్ధజలాలను సరఫరా చేసేందుకు ఎంపీ నిధులతో మూడు ఫిల్టరేషన్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. వాల్మీకినగర్, బాలగంగాధరతిలక్ బాలికల పాఠశాల, మారెమ్మగుడి వద్ద ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని మున్సిపల్ ఇంజినీర్ కోదండరాముడును ఆదేశించారు.

రైతు ఆకస్మిక మృతి

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని జక్కలవడికి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఐదేళ్ల కిందట అప్పుల బాధతో మృతుడి అన్న గ్రామం వదిలి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఆ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. రోజూ ఆ పరిస్థితులను గుర్తు చేసుకొని మదనపడేవాడు. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురై శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. తెదేపా నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి తిమ్మప్ప, రాఘవేంద్ర గుప్తా, తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, ఆనంద్ రాజు, ఆది, రమేశ్, చాంద్, నాగభూషణ పాల్గొన్నారు.


వాసవీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


పైకప్పు కారుతున్న చోట బకెట్ పెట్టారిలా..

శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం

శెట్టూరు, న్యూస్‌టుడే: వర్షాకాలం వస్తే చాలు శెట్టూరు తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది బకెట్లు పెట్టుకుని విధులు నిర్వహించాల్సి వస్తోంది. కార్యాలయం శిథిలావస్థకు చేరి పైకప్పులు పగుళ్లు ఏర్పడి కార్యాలయమంతా కారుతోంది. శనివారం కురిసిన వర్షానికి పైకప్పు లీకేజీ వల్ల వర్షపునీరు కారుతూనే ఉన్నాయి. దీంతో గదుల్లో కారేచోట్ల బకెట్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ గదిలో పైకప్పు అంతా కారుతోంది. దీంతో తహసీల్దార్ కూర్చోవాలన్నా పైకప్పు నుంచి నీటిచుక్కలు పడకుండా ఉండే స్థలాన్ని చూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దస్త్రాల గది కూడా కారుతుండటంతో రైతుల భూములకు సంబంధించిన దస్త్రాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పెద్ద వర్షాలు వచ్చినా, తుపాన్లు పట్టున్నా దస్త్రాలన్నీ తడిసిపోతాయి. మండలాలు ఏర్పడినప్పుడు నిర్మించిన గదులు కావడంతో పాతబడి శిథిలావస్థకు చేరాయి. దస్త్రాలు తడిసిపోతాయోనని రైతులు, కార్యాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని వివరణ కోరగా.. కార్యాలయం పాతబడటంతో వానకాలంలో నానా అవస్థలు పడుతున్నామన్నారు. దీంతో విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగానే ఉందని, దస్త్రాలు తడిసి పాడైతే వాటిని తయారు చేసుకోవడం కష్టమేనని చెప్పారు. ప్రస్తుతం పైకప్పులు కారకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేయించుకుంటామన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

విరులు.. లాభాల సిరులు


గుమ్మఘట్ట మండలం కేపీదొడ్డి వద్ద బంతిపూల సాగు

గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో రైతులు బంతి పూలు సాగు చేపట్టారు. ఏటా దసరా, దీపావళి పండగలకు దిగుబడి వచ్చేలా ప్రణాళికతో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు. గుమ్మఘట్ట మండలంలోని కేపీదొడ్డి, కొత్తపల్లి, కృష్ణాపురం, తాళ్లకెర, కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి, బోయలపల్లి, తిమ్మసముద్రం, గోళ్ల, బోరంపల్లి గ్రామాల్లో బంతి పూలు సాగులో ఉన్నాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.50 పలికితే పండగ పూట కిలో రూ.150 వరకు ధర పలుకుతున్నాయి. రైతులు ఎకరాకు సుమారు రూ.20వేలు పెట్టుబడి పెట్టి రూ.లక్ష దాకా లాభాలు గడిస్తారు. పూలను రాయదుర్గం, కర్ణాటకలోని చెళ్లకెర, మొలకాల్మూరు, బళ్లారి మార్కెట్లకు తరలిస్తారు. ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రెండు నెలల వరకు పంట కాలం ఉంటుందని రైతులు చెబుతున్నారు.



గుమ్మఘట్ట మండలం కేపీదొడ్డి గ్రామానికి చెందిన రైతు తిప్పేస్వామి ఎకరా విస్తీర్ణంలో బంతి పూలు సాగు చేశారు. ఇప్పటి వరకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పూలు నాణ్యతగా విరబూశాయి. పండగ వేళ పూలకు డిమాండ్ ఉంటుందని, లాభాలకు ఢోకా ఉండదని చెబుతున్నారు. గతేడాది కూడా ఎకరా విస్తీర్ణంలో పూలు సాగు చేసి రూ.లక్ష వరకు గడించినట్లు రైతు చెప్పారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



రోగులను పరీక్షిస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యుడు జయవర్ధన్ రెడ్డి

కాలానుగుణ వ్యాధులతో అప్రమత్తం

గుంతకల్లు, న్యూస్‌టుడే : కాలానుగుణ(సీజనల్) వ్యాధుల విషయంలో గ్రామాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని గుంతకల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యుడు జయవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని మలినేనిపల్లిలో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈకార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, సర్పంచి శ్రీరాములు, వేదిక నాయకులు గోపాల్, రామకృష్ణ పాల్గొన్నారు.

భాజపాతోనే పేదల సంక్షేమం

తాడిపత్రి, న్యూస్‌టుడే : భాజపా ప్రభుత్వంతోనే పేదలు అభివృద్ధి సాధిస్తారని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం తాడిపత్రిలోని పలు ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. భాజపాతోనే దేశరక్షణ, ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.



పథకాల గురించి అవగాహన కల్పిస్తున్న భాజపా నాయకులు

వ్యవసాయ పనుల్లో రైతన్నలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేపల్లి కాలువ నుంచి రెండురోజులు నుంచి వదిలే ఉప కాలువకు అధికారులు, నాయకులు నీరు విడుదల చేయడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎంతో కాలంగా నీళ్లు రాపోవడంతో పొలాలు బీళ్లుగా మారి కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ప్రస్తుతం నీరు వస్తుండటంతో ఈఏడాదైనా పంటలు సాగు చేసుకోవడానికి అన్నదాతలు పొలాల్లో పెరిగిన కంపచెట్లను తొలగించి, భూములు దుక్కులు చేసుకుంటున్నారు.

నూతన మసీదు ప్రారంభం

పామిడి, న్యూస్‌టుడే: ఓబుళాపురంలో నూతన మసీదును ఆదివారం మండల ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా చమన్ కుమారుడు డాక్టర్ ఉమర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్క ముస్లిం మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ఈకార్యక్రమంలో తెదేపా మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా, మహమ్మద్ రఫీ, ఓబుళాపురం, కొండాపురం, పామిడి మత పెద్దలు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: కల్లూరులో ఆదివారం జరిగిన ఘర్షణలో రామాంజనేయులు అనే వ్యక్తి గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా జరిగిన ఘర్షణలో తన సొంత అల్లుడు భరత్‌కుమార్ దాడి చేయడంతో బాధితుడు గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆయువతి తల్లిదండ్రులు ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బంధువుల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి, తొండపాడు గ్రామాలకు చెందిన ముగ్గురు మట్కా నిర్వాహకులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేశ్ సిబ్బందితో దాడులు చేసి కంబగిరి, దస్తగిరి, ప్రభాకరలను అరెస్టు చేసి వారి నుంచి రూ. 27,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో జూదరులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.18,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. గుంతకల్లు మండలం కసాపురం గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు.

ఇంజిన్ ఆయిల్ మార్చమని ఇస్తే కారు అమ్మేశారు

పెనుమలూరు, న్యూస్‌టుడే: ఆయిల్ మార్చమని ఓ యజమాని ఇచ్చిన కారును అమ్మేసిన వ్యక్తులపై కృష్ణా జిల్లా పెనుమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు సిద్ధాంతులు పవన్‌కుమార్ తాడిగడప నివాసి. ఆతను ఆంధ్ర ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగంలో పనిచేస్తుంటారు. ఆతనికి హోండా అమేజ్ కారు ఉంది. దీనికి ఇంజిన్ ఆయిల్ మార్పు బ్రేకులు సరిచేయడానికి తాడిగడపలోని అబ్దుల్ అజీమ్ అనే మెకానిక్ కొద్దిరోజుల కిందట ఇచ్చారు. రెండు రోజుల తర్వాత పవన్‌కుమార్ తన కారు కోసం వెళ్లగా రేపు, ఎల్లుండి అంటూ మెకానిక్ తిప్పించడం మొదలు పెట్టాడు. అనుమానం వచ్చిన పవన్‌కుమార్ వారం కిందట మరోసారి అజీమ్ వద్దకు వెళ్లి కారును చూపించమని అడగ్గా.. రమేష్ అనే వేరే మెకానిక్‌కు ఇచ్చానంటూ తెలిపాడు. దీంతో కారు యజమాని రమేష్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా అనంతపురం జిల్లా తాడిపత్రిలోని గంగాదరరెడ్డి అనే బ్రోకర్ ద్వారా ఆ ప్రాంతంలో ఉండే బ్రహ్మానందరెడ్డికి అమ్మేసినట్లు తెలుపడంతో అసలు యజమాని పవన్‌కుమార్ అవాక్కయ్యారు. దీనిపై పవన్‌కుమార్.. బ్రహ్మానందరెడ్డిని ప్రశ్నించగా తక్కువ ధరకు వచ్చిందని కొనుక్కొన్నానంటూ నిర్లక్ష్యంగా చెప్పాడు. పదేపదే కారు గురించి అడిగితే చంపేస్తానంటూ బెదిరించాడు. బాధితుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు మెకానిక్‌లు అబ్దుల్ అజీమ్, రమేష్, బ్రహ్మానందరెడ్డి, గంగాదరరెడ్డిలపై పెనుమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కవడియార్ చెరువు భద్రత పట్టదా?

◆ కట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు ◆ ఆందోళనలో స్థానికులు



చిక్కవడియార్ చెరువుకట్టపై ఏపుగా పెరిగిన ముళ్లకంప చెట్లు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలోనే అత్యంత పురాతన చెరువుల్లో బుక్కరాయసముద్రం చిక్కవడియార్ చెరువుకట్ట భద్రత గాలిలో దీపంలా మారింది. చెరువును 700 ఏళ్ల కిందట నిర్మించారు. 2500 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. ఇంతటి ప్రసిద్ధి చెందిన చెరువు భద్రతను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న ఈ చెరువు కట్టపై మూడు కిలోమీటర్ల మేర ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువు కట్ట నాణ్యత క్రమంగా దెబ్బతింటోంది. చెట్లు ఏపుగా పెరగడం వల్ల నీరు వచ్చినపుడు లీకేజీలు ఏర్పడతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల కిందట తప్పిన ప్రమాదం

రెండేళ్ల కిందట చెరువుకు భారీగా నీరు వచ్చినపుడు ముసలమ్మకట్ట వద్ద చెరువుకు గండి పడింది. అది కాలువ వెంటనే గండి పూడ్చడంతో పెను ప్రమాదం తప్పింది. కలెక్టరేట్ నుంచి ముసలమ్మకట్ట వరకు పదేళ్ల కిందట రూ.13 కోట్లతో మూడు కి.మీ.ల మేర చెరువుకట్ట, రహదారిని ఆధునీకరించారు. ముసలమ్మకట్ట నుంచి మరువకొమ్మ వరకు ఉన్న కి.మీ మేర చెరువుకట్టకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. కట్టకింద ఉన్న కాలనీల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రమాదకరంగా కట్ట

వాల్మీకి దేవాలయం వద్ద కట్ట అత్యంత ప్రమాదకరంగా మారింది. కట్ట కింద ఐలమ్మ, వీరభద్రకాలనీ, శర్మ, హమాలీ, ఎర్రినగర్, రామిరెడ్డి, బర్గకాలనీ, దక్షిణామూర్తినగర్ తదితర కాలనీల్లో 10 వేల మంది ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. కట్టను బలోపేతం చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఇంజినీరు సురేష్‌ను వివరణ కోరగా చెరువుకట్టను బలోపేత చేసి రహదారి ఏర్పాటు చేయడానికి రూ.7 కోట్ల నిధులు అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కట్టపై ఉన్న ముళ్లకంపలు కూడా త్వరలోనే తొలగిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244



సమస్య : గుంతకల్లు భాగ్యనగర్‌లో విజ్ఞాన స్కూల్ వద్ద చెత్త పక్కన రోడ్డుపై చెత్తకుండీ నిండిపోయింది. **- ఆంజనేయులు**
సమాధానం: చెత్తను తొలగిస్తాం. **- సుధాకర్, శానిటేషన్ కార్యదర్శి - న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

సమస్య : శింగనమల మండల పరిధిలోని పోతురాజుకాల్వ గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. **- శ్రీరాములు, పోతురాజుకాల్వ**
సమస్య: రాచేపల్లి ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- సుంకన్న, రాచేపల్లి**
సమాధానం : వైరెండు సమస్యలను పరిష్కరిస్తాం. **- నిర్మల కుమారి, ఎమ్.పీ.డీ.వో, శింగనమల - న్యూస్‌టుడే, శింగనమల**

సమస్య : నార్పల మేజర్ పంచాయతీలోని కూతలేరు నదిలో మురుగు ముందుకు కదలడం లేదు. **- శంకర్, నార్పల**
సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం. **- శైలజారాణి, ఈవోపీఆర్డీ, నార్పల - న్యూస్‌టుడే, నార్పల**

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణంలోని టీబీ రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షిక ఈనెల 6న వార్త ప్రచురితమైంది. సచివాలయం శానిటేషన్ కార్యదర్శి గంగాధర్ స్పందించారు. కార్మికులతో చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

సీపీఎం మండల కమిటీ ఎంపిక

గార్లదిన్నె గ్రామీణం: మర్తాడు గ్రామంలో సీపీఎం మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యలు, పరిష్కరించిన విషయాలు గురించి చర్చించారు. అనంతరం సీపీఎం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శిగా చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎం. నల్లప్ప, 12మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్.వి.నాయుడు, నాగేంద్ర, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పామిడి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన తెదేపా కార్యకర్త పెద్ద గోపాల్ కొన్ని రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆదివారం పట్టణ తెదేపా నాయకులు నిత్యావసర సరకులతో పాటు రూ.15వేలు నగదు అందజేశారు. బాధిత కుటుంబానికి తెదేపా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, విలిస్న ప్రతిభా వంతుల జిల్లా అధ్యక్షుడు కుమార్, తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మ మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పామిడి: వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు



గుత్తిలో అన్నపూర్ణ దేవిగా



శింగనమలలో రాజకుమారి అలంకరణ



గుంతకల్లు : కన్యకా పరమేశ్వరి



క్రిష్టిపాడులో అన్నపూర్ణాదేవిగా



పెద్దవడ్డూరులో చౌడేశ్వరీదేవి



కల్లూరులో అన్నపూర్ణాదేవి



తాడిపత్రిలో గాయత్రి దేవిగా

అంబ పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి



పాత గుంతకల్లు: గౌరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. -న్యూస్‌టుడే బృందం



తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో అమ్మవారు



బుక్కరాయసముద్రంలో దుర్గామాత



యాడికిలో అన్నపూర్ణ దేవి అలంకరణలో

'పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోం'

తాడిపత్రి: చౌక బియ్యం పంపిణీలో ఎవరైనా పేదలకు తక్కువ తూకాలతో మోసం చేస్తే ఊరుకునేది లేదని జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు కదిరి శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో ఇటు అధికారులు, అటు చౌక దుకాణదారులు లెక్కకు మించి అక్రమాలు చేశారన్నారు. ప్రస్తుతం అలాంటివి సాగవన్నారు. ప్రస్తుతం చౌక బియ్యం పంపిణీలో తక్కువ తూకాలపై తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సమావేశంలో పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డి

వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన

యాడికి, న్యూస్‌టుడే: యాడికి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఐటీఐలు ప్రవేశపెట్టిన ఇంటర్న్‌షిప్ పథకంలో భాగంగా పదో తరగతి ఒకేషనల్ గ్రూప్‌లో 54 మంది విద్యార్థులు స్థానికంగా ఉన్న ఇంటర్నెట్, చరవాణులు, ఎలక్ట్రికల్స్, ద్విచక్ర వాహన మరమ్మతుల దుకాణాలను సందర్శించి విషయాలు తెలుసుకున్నారు. వివిధ రకాల వృత్తులపై అవగాహన కలిగి ఉండటంతో స్వయం ఉపాధి దిశగా రాణించేందుకు అవకాశం ఉంటుందని వృత్తివిద్య ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి పేర్కొన్నారు.



క్షేత్రస్థాయి పరిశోధనకు వెళ్లిన విద్యార్థులు

ప్రజల కష్టాలపై దృష్టి సారించాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రజల కష్టాలను తెలుసుకుని, వారి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తే పార్టీ సభ్యత్వాల సంఖ్య పెరుగుతుందని అనంత జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో స్థానిక నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మార్కెట్ ప్రాంతంలో చేపట్టారు. పార్టీ నాయకులు శేషన్న, రమేష్, విజయలక్ష్మి, రామాంజనేయులు, విశ్వనాథ్, సూర్యనారాయణ, పురందర్, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, కాశవతి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలతోపాటు అన్నదాతల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సీపీఎం మండల మహాసభలను ఆదివారం మండల కేంద్రంలో స్థానిక షాదీఖానా మైదానంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మండల వ్యాప్తంగా తొమ్మిది సమస్యలపై తీర్మానం చేశారు. అనంతరం పార్టీ సిద్ధాంతాలు, విధులు, తదితర సమస్యలపై చర్చించారు. సీపీఎం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, కృష్ణనారాయణ, మహమ్మద్‌రఫీ, నారాయణ, హమాలీ యూనియన్ నాయకులు వీరాంజనేయులు, రామాంజనేయులు, సునీల్, పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల జప్తు

యాడికి, న్యూస్‌టుడే: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను యాడికి పోలీసులు జప్తు చేశారు. యాడికిలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇసుక లోడు వేసుకుని వెళ్తున్న ట్రాక్టర్లకు ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిని పట్టుకున్నారు. తాడిపత్రి మండలం జగదూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు మొలక వెంకటరమణయ్య, దాసరి నారాయణస్వామి, అన్వేశ్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు.



సజ్జలదిన్నె వద్ద రహదారిపై వేసిన నాపరాళ్ల బెచ్చులు

గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి నుంచి నంద్యాల, యాడికి పలు గ్రామాలు పట్టణాలు, పలు సిమెంటు పరిశ్రమలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. ఈమార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండలంలోని సజ్జలదిన్నె గ్రామసమీపంలో భారీగా గుంతలు పడ్డాయి. ఇటీవల కొందరు ఆ గుంతలు పూడ్చేందుకు భారీగా నాపరాళ్ల బెచ్చులు వేశారు. ఇవి ప్రమాదకరంగా మారాయి. దీనిపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి సాయికృష్ణను సంప్రదించగా వెంటనే అక్కడ గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తామని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వంటింటి సిలిండర్ల పంపిణీలో జాప్యం

వినియోగదారులకు తప్పని పాట్లు

యాడికి, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుక్ చేసిన రెండు మూడు రోజులకు వచ్చే గ్యాస్ సిలిండర్లు పది రోజులు దాటినా పంపిణీ జరగడం లేదు. గ్యాస్ వినియోగదారులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● యాడికి మండలంలో భారత్ గ్యాస్ ఏజెన్సీ లేకపోవడంతో గుత్తి నుంచి ఓ ఏజెన్సీ నిర్వాహకులు తమ వాహనాల ద్వారా ఇక్కడికి తెచ్చి పంపిణీ చేయడం జరుగుతుంది. రోజూ 200 సిలిండర్లను తెచ్చి పంపిణీ చేసినా తక్కువ వస్తున్నాయి. రోజు మార్చి రోజు కేవలం 50 నుంచి 70 దాకా తెస్తున్నారు. ముఖ్యంగా గృహాలకు అందించాల్సిన సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వాటిని హోటళ్లు, వివిధ వ్యాపార సంస్థలకు అమ్ముకుంటూ, ఏజెన్సీలకే సిలిండర్లు రావడం లేదంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఖాళీ సిలిండర్లను పెట్టుకున్న వినియోగదారులు

ఏర్పడింది. ఓ ఏజెన్సీ వారు సిలిండర్‌ను నేరుగా ఇంటికే అందజేస్తుండగా, భారత్ గ్యాస్ నిర్వాహకులు మాత్రం అలా చేయడం లేదు. ఇంటి వద్ద చేర్చేందుకు అదనపు రుసుం వసూలు చేస్తున్నారని, ఆయినా తెచ్చి ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాన్ని నిలిపి గ్యాస్ వచ్చింది, తీసుకెళ్లండి అంటూ చెబుతుండటంతో అక్కడికి వెళ్లి తెచ్చుకునేందుకు వృద్ధులు, మహిళలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. దీనిపై తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గ్యాస్ సిలిండర్ల సమస్య ఇంత వరకు మా దృష్టికి రాలేదు. నేరుగా వినియోగదారుల వద్దకే చేర్చాలి. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మోత మోయాల్సిందే..

ఇంటివద్దకే అందించాల్సిన సిలిండర్లను విని యోగదారులే మోసుకొని తీసుకెళ్లాల్సిన పరిస్థితి

తాగునీటి సరఫరాకు తొలగిన అడ్డంకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడడానికి మున్సిపల్ అధ్యక్షురాలు భవానీ, కౌన్సిల్ చొరవతో అధికారులు విద్యుత్తు మోటార్లను కొనుగోలు చేశారు. 100 అశ్వశక్తి(హెచ్‌పీ) ఉన్న 3 మోటార్లను రూ.40 లక్షలతో, 75, 50, 25 అశ్వశక్తి గల విద్యుత్తు మోటార్లు ఐదింటిని రూ. 28 లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసి వాటిని నీటిని శుద్ధం చేసే ప్లాంటు వద్ద భద్ర పరిచారు. ప్రస్తుతం వినియోగిస్తున్న మోటార్లు తరచూ కాలిపోవడమో, పనిచేయకపోవడమో జరుగుతున్నాయి. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంటంతో దీన్ని అధిగమించడానికి కొత్త మోటార్లను కొన్నామని ఏఈ హరికృష్ణ తెలిపారు. పాతవాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చే పనులను చేపడుతున్నామన్నారు. పాతవాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి స్టాండ్‌బైగా ఉంచుతామని తెలిపారు.



అధికారులు కొనుగోలు చేసిన విద్యుత్తు మోటార్లు

మురుగు తొలగించరూ

గుంతకల్లు, న్యూస్‌టుడే : మురుగు కాలువల పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. పట్టణంలోని భాగ్యనగర్‌లో భాగమైన బెంచికొట్టాలలోని కుంటకు చెందిన స్థలంలో షికారీ కుటుంబాలు కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వర్షంపడితే చాలు కాలనీ లోకి పెద్దఎత్తున నీరు చేరుతోంది. ఆ నీరు బయటకు పోవడానికి అవసరమైన మురుగు కాలువలు లేని కారణంగా నీరు నెలల తరబడి నిలిచి ఉంటోంది. అక్కడి జనం దుర్వాసనతో, దోమలతో అవస్థ పడుతున్నారు. పిల్లల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. మురుగు నీరు నిల్వ ఉండకుండా తమను అధికారులు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మురుగు కాలువలను నిర్మించడానికి రూ. 20 లక్షలు కేటాయించి పనులను గుత్తేదారుకు అప్పగించామని మున్సిపల్ ఏఈ హరికృష్ణ చెప్పారు. ప్రజలు మురుగు నీటితో ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే. గుత్తేదారుడు కాలువల నిర్మాణ పనులు త్వరగా చేపట్టే విధంగా చూస్తామని ఆయన పేర్కొన్నారు.



రహదారిపై మురుగు ఇలా..

నిత్యం ప్రయాణ సంకటం

రహదారి పనులతో ప్రమాద ఘంటికలు

శింగనమల, నార్పల, న్యూస్‌టుడే : అనంతపురం-తాడిపత్రి మధ్య జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. నాలుగు వరుసల రోడ్డును ఆరు వరుసలుగా మారుస్తున్నారు. శింగనమల నుంచి రెడ్డిపల్లి వరకు పనులు జరుగుతున్నాయి. ప్రకాదాసంగా నాయనపల్లిక్రాస్, బండమీదపల్లి, కొర్రపాడు, రోటరీపురం గ్రామాల వద్ద వంతెనల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడి రాకపోకలకు ఒకే రోడ్డు ఉంది. భారీ వాహనాలు, ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఎదురుగా వచ్చే వాహనాల ప్రమాదాలకు దగ్గరగా వెళుతున్నాయి. ద్విచక్ర వాహనాలను భారీ వాహనాలు ఢీకొనే అవకాశం లేకపోలేదు. రోడ్డు పక్కన ప్రమాద హెచ్చరికలు సరిగా ఏర్పాటు చేయలేదు. ఎదురుగా వచ్చే వాహనం మరో వాహనానికి దగ్గరగా వెళ్తుండటంతో ప్రమాదానికి ఆయన ఉంటున్నాయి. లారీలు, కార్లు, బస్సులు ఈ రోడ్డు పైనే అతి వేగంగా ప్రయాణిస్తున్నాయి. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో అని భయంతో వణికి పోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన గుత్తేదారులు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై జాతీయ రహదారి ఈఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా రోడ్డు పనులను వేగవంతం చేస్తామన్నారు. వంతెనల వద్ద ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.



ప్రమాదకరంగా వాహన రాకపోకలు ఇలా..

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

'లడ్డూ కల్తీ వ్యవహారంలో తప్పించుకోలేరు'

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠను ఎవరు దెబ్బ తీయలేరని, లడ్డూ కల్తీ విషయంలో ఏమి జరిగిందో త్వరలో బయటపడుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆయన సన్నిహితులతో కలిసి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి టీటీడీ డైరీని ఆవిష్కరించారు. గత ఐదేళ్లలో తిరుమల విషయంలో అనేక వివాదాలు రావడం బాధాకరమన్నారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: **గంగ:** సత్యం సుందరం, **గాయత్రి:** రామ్‌నగర్ బన్నీ, **గౌతమి:** కలి, మిస్టర్ సెలబ్రిటీ, **గౌరి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ:** దేవర, **తరంగిణి:** దక్షిణ, **తేజస్విని:** స్వాగ్.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య : అరవిందనగర్‌లోని మాజీ మేయర్ ఇంటి సమీపంలో మురుగు కాలువను శుభ్రం చేయలేదు. దుర్వాసన వస్తోంది. మురుగును తరలించండి.
- నాగార్జున

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం.
- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్‌ఓ - న్యూస్‌టుడే, అనంతపురం(కమలానగర్)

చెట్టు కొమ్మలు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

అనంతపురం(కమలానగర్): నగరంలోని రెండో రోడ్డులోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద రోడ్డుపై పడేసిన చెట్టు కొమ్మలను అధికారులు తొలగించారు. 'ఈనాడు'లో ఈ నెల 5న 'చెట్టు కొమ్మలు తరలించండి' శీర్షికన వార్త ప్రచురితమైంది. దాంతో వారు స్పందించి చెట్టు కొమ్మలను తరలించారు. పరిసరాలను శుభ్రం చేశారు.

రంగస్వామి చిత్రం పోస్టర్ విడుదల

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతంలో చిత్రీకరించిన 'రంగస్వామి' చిత్రం ట్రైలర్, పోస్టర్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చిత్ర బృందంతో కలిసి విడుదల చేశారు. ఆదివారం ఆర్అండ్‌బీ సమావేశ భవనంలో ఆయన మాట్లాడుతూ కళాకారులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రైలర్ చూశాక.. ఒక తండ్రి తన కుమారుడు బాగు కోసం ప్రయత్నించిన తీరు బాగుందన్నారు. జబర్దస్త్ నటుడు దుర్గారావు పాల్గొని సందడి చేశారు. ఈ నెల 25న చిత్రం విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్రం దర్శకుడు నరసింహాచారి, నటులు అబ్బాటీవీ హరిప్రసాద్, మహిత, షేక్షావలి పాల్గొన్నారు.

'నాయకులపై ఆరోపణలు చేస్తే సహించం'

అనంతపురం(బళ్లారిరోడ్డు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెదేపా నాయకుడు నలుబోలు మధురాయల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ప్రజా సేవ చేస్తున్న వారిపై ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నెరవేరుస్తున్నారని తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్, బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక గిల్డాఫ్ సర్వీసు పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. 185 మంది శిబిరానికి రాగా వైద్యులు పరీక్షించి 122 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆసిఫుద్దీన్, ఉమామహేశ్వరి, కంబదూరి నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. వ్యక్తికి దేహశుద్ధి

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: నగరంలోని విద్యుత్తునగర్ సర్కిల్ సమీపంలోని ముత్యాల్‌రెడ్డి హోటల్లో పని చేస్తున్న వెంకటేశ్ ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు దేహశుద్ధి చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి 8:30 గంటల సమయంలో టిఫిన్ కోసం వచ్చిన ఓ మహిళతో బిల్లు తీసుకోవద్దని, తాను ఇస్తానని అసభ్యకరంగా మాట్లాడటంతో ఆమె గొడవకు దిగారు. చుట్టుపక్కల ఉన్న వారు గమనించి అతడిని చితకబాదారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ తెలిపారు.

'రిజర్వేషన్ల హామీ అమలు చేయాలి'

రుద్రంపేట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల ముందు వాల్మీకి బోయలకు ఇచ్చిన గిరిజన రిజర్వేషన్ల హామీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర నాయకుడు కేశవ్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆచార్య సత్యపాల్, కారెం శివాజీ కమిటీ రిపోర్టు ఆధారంగా వాల్మీకి బోయలను గిరిజన తెగల జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. గత కమిటీల తీర్మానాలను అనుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెలగని దీపాలు.. తిరగని పంకాలు

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల పరిధిలో ఉన్న గృహ సర్వీసులకు

కనెక్షన్ ఇవ్వకుండానే అదనపు నియంత్రిక తరలింపు

హెచ్చుతగ్గుల విద్యుత్తు సరఫరా కాకుండా మూడు నెలల కిందట అధికారులు అదనపు నియంత్రిక ఏర్పాటుకు రోడ్డు పక్కన దిమ్మె నిర్మించారు. దానిపై 63కేవీ సామర్థ్యం గల నియంత్రికను తెచ్చి, చార్జ్ చేయకుండా పెట్టారు. తీగలతోపాటు కొంత సామగ్రి అవసరం ఉందని, వచ్చిన వెంటనే ప్రారంభించి నాణ్యమైన సరఫరా అందేలా చూస్తామని అధికారులు చెప్పారు. దాంతో కాలనీవాసులు మిన్నకుండిపోయారు. అయితే ఆగస్టులో ఆ నియంత్రికను వేరే ప్రాంతానికి తరలించారు. దాంతో సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం దిమ్మె దిష్టిబొమ్మలా మారింది. ఏడాదికిపైగా కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవటంతో వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారు.

● హెచ్చుతగ్గుల విద్యుత్తుతో కాలనీవాసులు సతమతం

హెచ్చుతగ్గుల విద్యుత్తు సరఫరా అవుతోంది. దాంతో బల్బులు, ఫ్యాన్లు, ఏసీలు పని చేయటం లేదు. అవి తరచూ కాలిపోతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పిల్లిగుండ్లకాలనీ, వాయుపుత్రనగర్, అమృతనగర్‌కు హెచ్చుతగ్గుల విద్యుత్తు సరఫరా అవుతోందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ 16నెలల కిందట నుంచి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. గత నెల కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్, విద్యుత్తు అధికారులకు, ఎస్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబరు 1912కు పలుమార్లు ఫిర్యాదు చేశామని స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రతిసారి సమస్యను చక్కదిద్దామని చెబుతూ ఫిర్యాదును మూసివేస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గత జూన్‌లో దిమ్మెపై ఏర్పాటు చేసిన నియంత్రిక

తగిన చర్యలు తీసుకుంటాం

నెల వ్యవధిలో నగరంలో ఏ యే ప్రాంతాల్లో హెచ్చుతగ్గుల సమస్య ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. అదనపు నియంత్రికలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- శ్రీనివాసులు, డీఈఈ

విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత పంపిణీ

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు భగవద్గీత ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించారు. 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పుస్తకాలను అందజేసి చదివించాలన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలకు పుస్తకాలు అందజేస్తామని, విద్యార్థుల సంఖ్యను చెప్పి పుస్తకాలు తీసుకెళ్లవచ్చని కోఆర్డినేటర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు శ్రీపాద వేణు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీల్లో తీరిన విద్యుత్తు కష్టాలు

చిన్నంపల్లి, న్యూస్‌టుడే: ఏళ్లుగా కాలనీలు విద్యుత్తు లైన్లు లేక చీకట్లో మగ్గాయి. ఎన్నికల ముందు ప్రజలు సమస్యను పరిటాల సునీత దృష్టికి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అనంతపురం గ్రామీణం చిన్నంపల్లి పంచాయతీలోని చిన్నంపల్లి, సజ్జలకాలువ, మటన్‌మార్కెట్, సునీతమ్మకొట్టాల, పరిటాల రవీంద్రకాలనీ, ఫెర్రర్‌కాలనీ, బీసీకాలనీ, సంతోష్‌నగర్‌కు సుమారు 70 స్తంభాలను మంజూరు చేయించారు. ప్రస్తుతం విద్యుత్తుశాఖ అధికారులు 38 స్తంభాలు, తీగలు, ఇతర సామగ్రిని కాలనీలకు మంజూరు చేశారు. ఆదివారం చిన్నంపల్లి సర్పంచి శివశంకర్ దగ్గరుండి సిబ్బందితో స్తంభాలు, తీగలు లాగించే పనులు చేయించారు. కాలనీల్లో విద్యుత్తు వెలుగులు నిండుకోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



తపోవనం వేద గాయత్రీదేవి ఆలయంలో..


అర్బన్‌బ్యాంకులో త్రిపుర సుందరీదేవి


రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ..


ఆత్మకూరు: శ్రీలలితా త్రిపుర సుందరిగా పార్వతీదేవి


శివకోటిలో వారాహిదేవి అలంకారం



ఆత్మకూరులో కన్యకాపరమేశ్వరి

జగజ్జననీ.. బహురూపిణి


దేవీ శరన్నవ రాత్రులు పురస్కరించుకొని జగజ్జననీ బహురూపాల్లో దర్శనమిచ్చారు. ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను విభిన్న రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. **- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం**


పాతూరు కన్యకాపరమేశ్వరిదేవి


ఉమానగర్‌లో రేణుకా యల్లమ్మ


మొదటి రోడ్డు శివాలయంలో ..


పాతూరు అమ్మవారిశాలలో వన విహారిణి అలంకారం


కొత్తూరు అమ్మవారిశాలలో..

'మహిళల రక్షణ విస్మరించారు'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: మహిళల రక్షణను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మేయర్ వసీం విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రోజు ఎక్కడో ఒక చోట మహిళలపై దాడులు, అత్యాచారాలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఓ చిన్నారిని అపహరించారని, పోలీసులు వేగంగా స్పందించి ఉంటే బతికేదన్నారు. రాష్ట్రంలో పలు అకృత్యాలు జరుగుతున్నా హోంమంత్రి అనిత ఎందుకు వేగంగా స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్లు మొఘల్ సైపుల్లాబేగ్, రహంతుల్లా, మహిళా నాయకురాలు హసీనా బేగం పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు చీరల పంపిణీ

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని రోటరీక్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. బీకే సముద్రం మండలం బొమ్మలాటపల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి దాదాపు రూ.20 వేల విలువైన చీరలు వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు భవానీ రవికుమార్, కార్యదర్శి గల్లా హర్ష, దాతలు ఎం. మల్లారెడ్డి, ఎంవీ పాండురంగయ్య, క్లబ్ సీనియర్ సభ్యులు వి. సూర్యనారాయణ, ఆనందరావు, రాంకుమార్, మేడా అరవింద్, శాంతరాజ్ తదితరులు పాల్గొని చీరలు పంపిణీ చేశారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసులు పలు తనిఖీలు నిర్వహించారు. అనంతపురంలోని ఒకటో పట్టణ పోలీసులు తిలక్‌రోడ్డులోని ఓ దుకాణంపై దాడులు చేసి అక్రమంగా ఉంచిన రూ.70 వేలు విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. గుత్తిలో ముగ్గురు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి వారి నుంచి రూ.27,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేసి నిబంధనలు పాటించని యజమానులకు జరిమానా విధించారు. మాదక ద్రవ్యాలు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.


స్వాధీనం చేసుకున్న టపాసులను చూపుతున్న పోలీసులు

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే లక్ష్యం

● సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అప్పుడే విద్యా లక్ష్యాలను చేరుకోగలుగుతామని సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీఎం రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్, స్కూల్ ఇన్‌ఫ్రా బి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల క్రీడా పోటీలకు ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని, ఈ అంశం తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే మాట్లాడి రెండు రోజుల్లో రాష్ట్రంలో అన్ని జిల్లాలకు నిధులు జమయ్యేలా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఖాళీగా ఉన్న పీఈటీ, పీడీ ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ ప్రకటన ఇచ్చి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో భాగస్వామ్యం కావాలని, క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం కలుగుతుందని స్థానిక కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు.



ప్రమాదకరంగా కల్వర్టు

నగరంలోని గుల్జార్‌పేట కాలనీలో ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లే దారిలో కల్వర్టుపై సిమెంటు దిమ్మెలు సక్రమంగా లేకపోవడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు పలువురు కిందపడి గాయాల పాలవుతున్నారు. దిమ్మెల కింద కాలువలో మురుగునీరు ముందుకు కదలడం లేదు. తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలు బెడద ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు. కల్వర్టుకు మరమ్మతులు చేసి, కాలువలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం(గుల్జార్‌పేట)

పిచ్చిమొక్కలు తొలగించరూ

రాంనగర్ పార్కు సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ఫ్యూజు బోర్డు, తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. గాలి వీచినప్పుడు నిప్పు రవ్వలు పడుతున్నాయని స్థానికులు తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి నియంత్రిక చుట్టూ అల్లుకున్న తీగ జాతి మొక్కలు, పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, రుద్రంపేట



రహదారి బురదమయం

నగరంలోని పాతూరు మార్కెట్ వద్ద ఉన్న చెన్నకేశవస్వామి ఆలయం ముందు భాగం బురదతో నిండిపోయింది. సమీపంలోని నివాసగృహాలకు వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా బురదలో పడే పరిస్థితి. వాహనాలు వెళ్లే సమయంలో బురద దుస్తులపై పడుతోంది. చిన్నవర్షానికే రహదారి బురదమయంగా మారి రోజుల తరబడి ఉంటోంది.

- న్యూస్‌టుడే, రాణినగర్

రోడ్డు కుంగుతోంది.. కాలువ భయపెడుతోంది!

నగరంలోని రైల్వే ఫీడరు రోడ్డులోని వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా దుకాణాల వద్ద ప్రమాదం పొంచి ఉంది. పలు ప్రాంతాల్లోని మురుగు కాలువ నీరు రోడ్డును దాటి వెంకటేశ్వర గుడి సమీపంలో వెళ్లాల్సి ఉంటుంది. ప్రధాన రోడ్డు నుంచి అంతర్భాగంలో వెళ్లేందుకు కాలువను మళ్లించే ప్రాంతంలో ఎక్కువగా చెత్త, చెదారం, ఇతర వ్యర్థాలు అడ్డంగా పడుతున్నాయి. రోడ్డు పక్కనే దుకాణాలకు వెళ్లే చోట బండలు తొలగించారు. వారం రోజులు అవుతున్నా బండలు వేయకుండా అలాగే వదిలేశారు. రోడ్డు రోజు రోజుకు కుంగిపోయి గుంతలు పడుతోంది. పలువురు ద్విచక్రవాహనదారులు కింద పడ్డారు. భారీ వాహనాలు వెళితే ఏ సమయంలో అయినా మరింత దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది.


మురుగు కాలువ దుస్థితి


కుంగిన ప్రధాన రోడ్డు

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక


నినాదాలు చేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి ఉద్యోగుల సంఘ సమావేశం ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల క్యాడర్ అనుగుణంగా 12వ పీఆర్సీ వేతనాలు స్థిరీకరించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మలేరియా విభాగం సబ్‌యూనిట్‌లో ఎంపీహెచ్‌ఎస్ పోస్టులు మంజూరు చేయాలి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓ, ఎంపీహెచ్‌ఈవో పోస్టులు కేటాయించాలని, తదితర డిమాండ్ల సాధనకు పోరాటం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో చంద్రమోహన్, లక్ష్మన్న, వెంకటరమణ, రాఘవేంద్ర, జానీ, హరికృష్ణ, విజయ్‌కుమార్, లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పండగ పూటా.. వేతనాలు ఇవ్వరా?

కూడేరు, న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 7 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద ఆ పథకం ప్రధాన పంపింగ్ కేంద్రం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు ప్రకటించారు. జడ్పీకి వచ్చిన ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇవ్వకుండా ఎక్కడికి మళ్లించారని ప్రశ్నించారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రతినిధి నాగమణి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డు పరిధిలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్న 9 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసు స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.31 వేలు నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'జగన్ తిరుపతి, లండన్ వెళ్లకుండా ఇబ్బందులు'

రాణినగర్, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి, లండన్ వెళ్లకుండా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడుతున్నారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. హిందూవుల మనోభావాలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కించపరిచారన్నారు.

భవన నిర్మాణాలకు మోక్షమెన్నడో?

● నాలుగేళ్లుగా సిబ్బంది నరకయాతన ● ఇదీ వైకాపా ప్రభుత్వం పాపమే

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: 'గ్రామస్థాయిలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు పరిపాలన అందించాలి. ఒక్కో కార్యాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండాలి. అన్ని సేవలు గ్రామస్థాయిలో అందించాలన్న గత వైకాపా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. ఉద్యోగులను నియమించారు. కాని నాలుగేళ్లుగా కనీసం భవనాలు పూర్తి చేయలేకపోయారు. ఎక్కడిక్కడే పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఉద్యోగులు పడుతున్న వేదన అంతఇంత కాదు. కనీసం మరుగుదొడ్లు లేక మహిళా ఉద్యోగులు నరకయాతన పడుతున్నారు."


అర్ధాంతరంగా ఆగిన విలేజ్ క్లీనిక్ భవనం

అనంతపురం గ్రామీణం ఎ.నారాయణపురం పంచాయతీలోని విద్యారణ్యనగర్‌లో గ్రామ సచివాలయం-5 కింద 2020లో సచివాలయం, విలేజ్ క్లీనిక్ భవనాలు మంజూరు చేశారు. కమ్యూనిటీ హాలు వద్ద ఒకేచోట నిర్మాణాలు చేపట్టారు. సచివాలయ భవనానికి ఎన్నికల ముందు తెల్ల రంగు కొట్టి వదిలేశారు. మిగిలిన పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. విలేజ్ క్లీనిక్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కనీసం మరుగుదొడ్డి పూర్తి చేయలేదు. గుత్తేదారుడికి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. ఇప్పటికీ కమ్యూనిటీ హాలులోని చిన్న గదిలో ఉద్యోగులు విధులు కొనసాగిస్తున్నారు.

ప్రజలకు అందని వైద్యసేవలు

సచివాలయం పరిధిలో ఆరు కాలనీలు ఉన్నాయి. అందులో విద్యారణ్యనగర్, మౌర్యఎస్టేట్, విద్యానగర్, రంగారెడ్డికాలనీ, గణేశ్‌నగర్, పాపంపేటలో సగం ప్రాంతం ఉంది. మొత్తం 3,300 ఇళ్లు ఉండగా.. 12 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ప్రజలకు సచివాలయ సేవలందుతున్నాయి.. కాని వైద్యం అందడం గగనమైంది. గత వైకాపా ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఇదేనా అంటూ కాలనీల్లో ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని ఎ.నారాయణపురం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా రెండ్రోజుల కిందటే బాధ్యతలు తీసుకున్నా. ఆగిపోయిన భవనాలను పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



సచివాలయానికి తెల్లరంగు వేసి వదిలేశారిలా..